
సాక్షి
ఒడిశా
శుక్రవారం । 19 । మే । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయంలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన హుండీ ఆదాయాన్ని ఆలయ పాలక వర్గం గురువారం లెక్కించారు. ఇందులో నగదు రూ.2,30,749, బంగారం 650 మిల్లీ గ్రాములు, వెండి 8 గ్రాముల 500 మిల్లీ గ్రాములు వచ్చాయని అధికారులు వెల్లడించారు.



యువత క్రీడల్లో రాణించాలి

- 8లో



కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు

- 8లో

న్యూస్‌రీల్

చిక్కుల్లో మంత్రి ప్రఫుల్ల మల్లిక్



మంత్రి ప్రఫుల్ల మల్లిక్

భువనేశ్వర్: రాష్ట్ర ఉక్కు, గనుల శాఖ మంత్రి ప్రఫుల్ల మల్లిక్ చిక్కుల్లో పడ్డారు. రాష్ట్ర హైకోర్టు ఆదేశాలతో ఆయనకు ఎదురు దెబ్బ తగిలింది. ఢెంకనాల్ జిల్లా కామాఖ్య నగర్ పోలీసుస్టేషన్‌లో ఆయనకు వ్యతిరేకంగా పెండింగులో ఉన్న కేసును రద్దు చేయాలనే అభ్యర్థనను రాష్ట్ర హైకోర్టు సున్నితంగా తిరస్కరించింది. ఈ కేసు విచారణకు తెరదించాలని మంత్రి హైకోర్టులో పిటిషన్ వేశారు. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన హైకోర్టు, పెండింగులో ఉన్న కేసుల విచారణ కింది కోర్టు చేపడుతుందని ఆదేశించింది. 2013 సంవత్సరంలో కామాఖ్యనగర్ పోలీసుస్టేషన్‌ను విధ్వంసకర దాడిలో నిందితుడిగా మంత్రి ఉన్నారు. ఈ సంఘటనలో మంత్రి, అతని మద్దతుదారులపై కేసు నమోదైంది. ఈ ఘటనకు సంబంధించి అప్పట్లో నిందితులకు వ్యతిరేకంగా ఐపీసీ 147, 332, 333, 334, 307, 506, 34 సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు.

యువతి అనుమానాస్పద మృతి



జొరొనా మృతదేహం

రాయగడ: జిల్లాలో కల్యాణ సింగుపూర్ సమితి సికరపాయి గ్రామంలోని గొడావీధిలో ఒక యువతి అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. మృతురాలు బిసంకటక్ సమితి గుటునా గ్రామానికి చెందిన జొరొనా గంతాయిత్ (16) గా గుర్తించారు. గదిలో ఉరి వేసుకొని ఉండడంతో ఆత్మహత్య చేసుకుందా.. హత్య జరిగిందా అనే కోణంలో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. యువతి మూడు రోజుల క్రితం సికిరపాయి గ్రామంలోని తన అక్కా, బావ ఇంటికి వచ్చింది. గ్రామంలో జరుగుతున్న అమ్మవారి జాతర చూసేందుకు బుధవారం రాత్రి అందరూ కలిసి వెళ్లారు. అయితే కొద్దిసేపటికి జొరనా కనిపించకపోవడంతో అక్కాబావలు ఊరంతా వెతికారు. అనంతరం ఇంటికి రాగా ఇంటిలో ఉరి వేసుకొని ఉండడం చూసి షాక్ అయ్యారు. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయగా, సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు.

'కార్మికుల సమస్యలు పరిష్కరించండి'



ఆందోళన జరుపుతున్న మరణించిన కార్మికుడి భార్య

జయపురం: సేవా పేపరు మిల్లు విశ్రాంత, మరణించిన కార్మికుల కుటుంబాల సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం దృష్టి సారించాలని కార్మిక నేత ప్రమోద్ కుమార్ మహంతి విజ్ఞప్తి చేశారు. గురువారం పేపరు మిల్లు హెడ్ ఆఫీస్ ముందు దివంగత రబీ నారాయణ చౌధరి భార్య ధర్నా చేయడంపై ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మరణించిన కార్మికుల కుటుంబాలకు చెల్లించాల్సిన పీఎఫ్, గ్రాడ్యుటీ, పెన్షన్ బకాయిలను ఇవ్వాలని కోరుతూ జనవరి నుంచి ఆందోళనలు చేస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. బీహారు నుంచి వచ్చి పేపరు మిల్లులో 1985 నుంచి ఫీనిషియర్‌గా పనిచేసి 2020లో రిటైర్ అయిన జయరాం ప్రసాద్‌కు రావాల్సిన బకాయిలు చెల్లించకపోవడంతో, ఇంటి అద్దెలు సైతం చెల్లించలేని పరిస్థితిలో ఉన్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. పేపరు మిల్లులో ప్రతిరోజూ రూ.కోట్ల బిజినెస్ జరుగుతున్నా యాజమాన్యం బకాయిలు చెల్లించడం లేదని ఆరోపించారు. 2020లో పేపరు మిల్లును మదర్ అర్థ కంపెనీ కొనుగోలు చేసి హస్తగతం చేసుకోగా, 2022 నుంచి మిల్లులో ఉత్పాదన ప్రారంభమైందని అయినా కార్మికుల కష్టాలు తీరలేదన్నారు. ఇలా అనేక మంది అనేక ఇబ్బందులు పడుతున్నారని, ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సమస్యలు పరిష్కరించాలని కోరారు.

ఒడిశాలో 'వందే భారత్'

- రాష్ట్రంలో తొలి రైలు సేవలు ప్రారంభం
- వర్చువల్ విధానంలో ప్రారంభించిన పీఎం నరేంద్రమోదీ, సీఎం నవీన్ పట్నాయక్
- రూ.8,000 కోట్ల రైల్వే ప్రాజెక్టులు: ప్రధానమంత్రి నరేంద్రమోదీ



రైలుని రాష్ట్ర గవర్నర్‌తో పాటు పరిశీలిస్తున్న కేంద్రమంత్రులు

భువనేశ్వర్: రాష్ట్రంలో తొలి వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు సేవలను ప్రధానమంత్రి నరేంద్రమోదీ గురువారం వర్చువల్‌గా ప్రారంభించారు. పూరీ – హౌరా మధ్య 22895/22896 వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు సేవలు అందుబాటులోకి వచ్చాయి. ఈ రైలు ఒడిశాలో ఖుర్దా, కటక్, జాజ్‌పూర్–కియోంజర్ రోడ్, భద్రక్, బాలాసోర్ జిల్లాల మీదుగా, పశ్చిమ బెంగాల్‌లో పశ్చిమ్ మెదినీపూర్, తూర్పు మెదినీపూర్ జిల్లాలు గుండా రాకపోకలు చేస్తుంది. ఈ రైలు వినియోగదారులకు వేగవంతమైన, సౌకర్యవంతమైన సదుపాయాలతో సుఖమయమైన ప్రయాణ అనుభవాన్ని అందిస్తుందని ప్రధానమంత్రి పేర్కొన్నారు. పర్యాటక రంగం పురోగతికి దోహదపడి ప్రాంతీయ ఆర్థికాభివృద్ధిని ప్రోత్సహిస్తుందన్నారు. అలాగే రాష్ట్రంలో రూ. 8000 కోట్లకు పైగా విలువైన పలు రైల్వే ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశారు. పూరీ, కటక్ రైల్వేస్టేషన్ల పునరాభివృద్ధికి చర్యలు తీసుకున్నారు. ఈ స్టేషన్లలో రైలు ప్రయాణికులకు ప్రపంచ స్థాయి ఆధునిక సౌకర్యాలు కల్పించడమే ఈ ప్రాజెక్టు లక్ష్యంగా పేర్కొన్నారు. ఒడిశాలో రైలు నెట్‌వర్క్‌ను 100 శాతం విద్యుద్ధీకరణకు మోదీ అంకితం చేశారు. ఇది నిర్వహణ వ్యయ ప్రయాసల్ని తగ్గిస్తుందని, దిగుమతి చేసుకున్న ముడి చమురుపై ఆధారపడటాన్ని నివారిస్తుందన్నారు. అలాగే సంబల్‌పూర్ – టిట్‌లాగఢ్ రైలు మార్గం డబ్లింగ్, అంగుల్, సుకింద మధ్య కొత్త బ్రాడ్ గేజ్ రైలు మార్గం, మనోహర్‌పూర్ – రౌర్కెలా – ఝార్సుగుడ – జమ్‌గా ప్రాంతాలను అనుసంధాన పరిచే మూడో రైలు లైన్, బిచ్చుపాలి – ఝుర్‌తర్భా మధ్య కొత్త బ్రాడ్ గేజ్ మార్గం సేవలను జాతికి అంకితం చేశారు. పూరీ రైల్వేస్టేషన్‌లో జరిగిన ప్రారంభోత్సవ కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్ ప్రొఫెసరు గణేషీ లాల్, కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్, కేంద్ర విద్య, నైపుణ్య అభివృద్ధి శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, పూరీ లోక్‌సభ సభ్యుడు పినాకి మిశ్రా, స్థానిక ఎమ్మెల్యే జయంత కుమార్ షడంగి, తూర్పు కోస్తా రైల్వే జనరల్ మేనేజర్ మనోజ్ శర్మ, ఖుర్దారోడ్ మండల రైల్వే అధికారి రింకేష్ రాయ్ పాల్గొన్నారు. ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ ఈ కార్యక్రమానికి వర్చువల్‌గా హాజరయ్యారు.

త్వరితగతిన పూర్తి చేయాలి

రాష్ట్రంలో రైల్వే ప్రాజెక్టుల పనులు మందకొడిగా కొనసాగుతున్నాయని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.



వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌ను వర్చువల్‌గా ప్రారంభిస్తున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, సీఎం నవీన్ పట్నాయక్

దీర్ఘకాలంగా చేపట్టిన అంగుల్ – సుకింద లైన్ మరియు హరిదాస్‌పూర్ – పారాదీప్ లైన్ నిర్మాణపు పనుల్ని సత్వరమే పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ప్రతిపాదిత శ్రీజగన్నాథ్ పూరీ అంతర్జాతీయ విమానాశ్రయం ప్రాజెక్టుపై ఇటీవల ప్రధానమంత్రితో జరిగిన సంప్రదింపులను ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మరోసారి గుర్తు చేశారు. ప్రపంచ స్థాయి సముద్ర తీర విమానాశ్రయం నిర్మాణంపై రాష్ట్ర ప్రభుత్వం అత్యంత చురుకుగా సన్నాహాలు చేస్తోందన్నారు. రానున్న 3 నుంచి 4 సంవత్సరాల్లో విమానాశ్రయం సిద్ధమవుతుందని పేర్కొన్నారు.

త్వరలో వందే మెట్రో

రాష్ట్రానికి త్వరలో వందే మెట్రో, వందే స్లీపరు వంటి అధునాతన రైలు సౌకర్యాలు అందుబాటులోకి రానున్నాయని రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. ఒడిశాలో రెండో వందే భారత్ ఎక్స్‌ప్రెస్ వచ్చే అవకాశం ఉందని ఆయన సూచనప్రాయంగా ప్రకటించారు. పూరీ – భువనేశ్వర్ – కటక్ మార్గంలో వందే మెట్రో సర్వీసును ప్రవేశపెట్టే యోచనలో ఉన్నట్లు ఆయన తెలిపారు.



కిక్కిరిసిన పూరీ రైల్వేస్టేషను



సాంప్రదాయ నృత్యాలు ప్రదర్శిస్తున్న దృశ్యం



వందే భారత్ ఎక్స్‌ప్రెస్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న గవర్నర్, రైల్వే శాఖ మంత్రి తదితరులు

వేగవంతమైన సేవలతో మేలు

- సీఎం నవీన్ పట్నాయక్

భువనేశ్వర్: రాష్ట్రంలో వేగవంతమైన రైలు సేవలతో ఆర్థిక వ్యవస్థకు మేలు జరుగుతుందని ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ అన్నారు. పూరీ నుంచి హౌరాకు వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు ప్రారంభోత్సవానికి వర్చువల్‌గా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఒడిశాకు మరో రెండు కొత్త వందే భారత్ రైళ్లతో సహా అనేక కొత్త ప్రాజెక్టులను కేటాయించాలని ప్రధానమంత్రికి అభ్యర్థించారు. ప్రతిపాదిత ప్రాజెక్టులను నిర్ధారిత కాల పరిమితిలో పూర్తి చేయాలన్నారు. సంబల్‌పూర్ అనుసంధానంతో పూరీ – రౌర్కెలా వందేభారత్ ఎక్స్‌ప్రెస్, పొరుగు రాష్ట్రాల్లో ప్రముఖ కేంద్రాలతో కలిపే మార్గంలో భువనేశ్వర్ – హైదరాబాద్ మధ్య మరొక వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలును ప్రవేశపెట్టాలని ప్రతిపాదించారు. ఈ నగరాల మధ్య ప్రయాణికులకు వేగవంతమైన ప్రయాణంతో ప్రయోజనం ఉంటుందన్నారు. రాష్ట్రంలో పూరీ వారసత్వ కేంద్రంగా అభివృద్ధి చెందుతుంది. భారత దేశంలో పూరీ మొదటి నగరంగా 100 శాతం డ్రింక్ ఫ్రం ట్యాప్ సౌకర్యాన్ని కలిగిన ప్రాంతంగా ప్రాధాన్యత సంతరించుకుందన్నారు. అలాగే పూరీ – కోణార్క్ కొత్త రైలు మార్గాన్ని మంజూరు చేయాలని కోరారు. ఈ ప్రాజెక్టు నిర్మాణ వ్యయంలో 50 శాతం, అవసరమైన స్థలం రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా కేటాయించేందుకు సిద్ధంగా ఉందని ప్రకటించారు

లంచం తీసుకుంటూ పట్టుబడిన క్లర్క్



లంచం తీసుకున్న క్లర్క్ అశ్వినీ కుమార్ ప్రధాన్



అరెస్టు చేయబడిన సీడీపీవో నొమిత రాణిపాల్

జయపురం: అంగన్‌వాడీ వర్కర్ ఉద్యోగానికి రూ.40 వేల లంచం తీసుకుంటూ ఒక క్లర్క్ పట్టుబడగా, అతడిని లంచం తీసుకునేందుకు ప్రేరేపించిన సీడీపీవోని జయపురం విజిలెన్స్ అధికారులు అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. కొరాపుట్ జిల్లా బందుగాం సమితి డెరక గ్రామం అంగన్‌వాడీ కార్యకర్త పోస్టును రౌత్ కులశిక అనే వ్యక్తి కుమార్తెకు ఇచ్చేందుకు సీడీపీవో నొమిత రాణిపాల్ సూచన మేరకు క్లర్క్ అశ్వినీ కుమార్ ప్రధాన్ రూ.40 వేల లంచం డిమాండ్ చేశాడు. దీంతో రౌత్ కులశిక ఈ విషయాన్ని జయపురంలో గల కొరాపుట్ విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదు చేశాడు. విజిలెన్స్ ఎస్పీ ఆదేశానుసారం డీఎస్పీ సుశాంత కుమార్ బిశ్వాల్, విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ సూర్యకాంతి టక్రి, సంజయ కుమార్ ప్రధాన్‌లు సిబ్బందితో ఆ క్లర్క్‌ను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకునేందుకు వ్యూహరచన చేశారు. దీనిలో భాగంగా బుధవారం మధ్యాహ్నం బందుగాంలోని అశ్వినీ కుమార్ ప్రధాన్ కార్యాలయం వద్ద మాటు వేశారు. అనంతరం రౌత్ కులశిక రూ.40 వేలు లంచం ఇస్తుండగా విజిలెన్స్ సిబ్బంది దాడి చేసి అరెస్టు చేశారు. అలాగే మరో విజిలెన్స్ టీమ్ కొరాపుట్‌లోని సీడీపీవో కార్యాలయంపై దాడి జరిపి సీడీపీవో నొమిత రాణిపాల్‌ను అరెస్టు చేశారు. అలాగే నందపూర్‌లోని ఆమె ఇంటిపై దాడి చేసి రూ.91 వేల నగదు సీజ్ చేశారు. అదేవిధంగా సునాబెడ గంజాం కాలనీలో క్లర్క్ ఇంటిపై దాడి జరిపినట్లు వెల్లడించారు. అరెస్టైన ఇద్దరిపై కేసులు నమోదు చేసినట్లు విజిలెన్స్ వర్గాలు తెలిపాయి.

ప్రాణం తీసిన పసరు మందు



సన్ని మృతదేహం

మల్కన్‌గిరి: జిల్లాలో ఖోయిర్‌పూట్ సమితి కుడుములగుమ్మ పోలీసుస్టేషన్ పరిధిలోని పర్కన్‌మాల పంచాయతీ దంగపూట్ గ్రామానికి చెందిన మహిళ తలనొప్పికి పసరు మందు తాగడంతో ప్రాణం పోయింది. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన సహదేవ్ ముదిలి భార్య సన్ని ముదిలికి కొన్ని రోజులుగా తల నొప్పి వస్తోంది. దీంతో ఆమెకు ఎవరో ఒక మహిళ అడవిలోని ఒక చెట్టు పసరు తాగితే నొప్పి పూర్తిగా తగ్గిపోతుందని చెప్పడంతో బుధవారం సాయంత్రం పసరు మందు తాగింది. ఫలితంగా ఆమెకు రాత్రి 10 గంటల సమయంలో వాంతులు అవ్వడంతో కుడుములగుమ్మ ఆరోగ్య కేంద్రానికి చికిత్స నిమిత్తం తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతి చెందింది. విషయం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించి, అనంతరం భర్తకు అప్పగించారు.

హత్య కేసు నిందితులు అరెస్టు



మాట్లాడుతున్న ఎస్పీ సార్వణ్ వివేక్



పోలీసులు అరెస్టు చేసిన నిందితులు

- ఆరుగురిని అరెస్టు చేసిన పోలీసులు

బరంపురం: ఈనెల 6వ తేదీన నగర శివారు ఆచార్య గణేష్ విహార్‌లో పాత కక్షలతో సనాతన్ చౌదరి అనే వ్యక్తిపై దుండగులు మారణాయుధాలతో దాడిచేసి హత్య చేసిన విషయం తెలిసిందే. ఈ ఘటనకు సంబంధించి ఆరుగురు నిందితులను అరెస్టు చేసినట్లు బరంపురం ఎస్పీ సార్వణ్ వివేక్ తెలియజేశారు. బుధవారం సాయంత్రం ఆయన మాట్లాడుతూ.. సనాతన్ చౌదరిపై దాడి చేసిన అనంతరం నిందితులు పరారయ్యారు. ఘటనపై పెద్ద బజార్ పోలీసుస్టేషన్‌లో బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు ఒక ప్రత్యేక బృందంగా ఏర్పడి దర్యాప్తు చేపట్టారు. దీనిలో భాగంగా 6గురు నిందితులను అరెస్టు చేసి, వారి వద్ద నుంచి 70 గ్రాముల బంగారం చైన్, 7 మొబైల్స్, ఒక కత్తి, 2 ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలియజేశారు.



స్వాధీనం చేసుకున్న మొబైల్స్, మారణాయుధం

అరెస్టైనవారిలో పెద్ద బజార్ పోలీసుస్టేషన్ పరిధిలోని ప్రశాంత్ కుమార్ సాహు(20), ప్రకాష్ కుటియా(19), శివ నాయక్(25), కలియా సాహు(27), రామోరావులో(19), రాహుల్ పండా(20)లు ఉన్నట్లు గుర్తించారు. వీరిపై గంజాం, బరంపురం పోలీసుస్టేషన్ల పరిధిలో ఇప్పటికే పలు కేసులు ఉన్నట్లు పేర్కొన్నారు.

వందే భారత్ ఎక్స్‌ప్రెస్ ఛార్జీలు

భువనేశ్వర్: పూరీ – హౌరా మధ్య ప్రారంభమైన 22895/22896 వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలులో ఆహారం ఛార్జీలతో పాటు టికెటు ధర నిర్ణయించారు. రైలులో ఆహారం అవసరం లేకుంటే మినహాయింపు కల్పించి టికెటు ఛార్జీలు కుదిస్తారు. టికెటు బుక్ చేసుకునే సమయంలో ప్రయాణికుడు ప్రకటించిన నిర్ణయం మేరకు ఈ సౌకర్యం కల్పిస్తారు. నో ఫుడ్ ఆప్షన్ ఎంచుకుంటే, క్యాటరింగ్ ఛార్జీలు టికెటు ధర నుంచి నుంచి మినహాయిస్తారు. హౌరా నుంచి ఈ రైలు ఆగే పలు రైల్వేస్టేషన్ల వరకు ప్రయాణ ఛార్జీల వివరాలు ఇలా ఉన్నాయి. దీనిలో ఏసీ చైర్ కారు (సీసీ) కేటరింగ్ ఛార్జీ రూ.162లు, ఎగ్జిక్యూటివ్ చైర్ కారు (ఈసీ) కేటరింగ్ ఛార్జీ రూ.195లుగా ఉంటాయి.

హౌరా నుంచి పలు స్టేషన్ల ప్రయాణ టికెట్ ధరలు	
ఏసీ చైర్ కారు (సీసీ)	
స్టేషను	టికెటు (రూ)
పూరీ	1,265
ఖుర్దా రోడ్ జంక్షన్	1,320
భువనేశ్వర్	1,295
కటక్	1,040
జాజ్‌పూర్ - కెంజొహర్ రోడ్	915
భద్రక్	855
బాలాసోర్	805
ఖరగ్‌పూర్	605

ఎగ్జిక్యూటివ్ చైర్ కార్ (ఈసీ)	
పూరీ	2,420
ఖుర్దా రోడ్ జంక్షన్	2,385
భువనేశ్వర్	2,320
కటక్	2,015
జాజ్‌పూర్ - కెంజొహర్ రోడ్	1,760
భద్రక్	1,690
బాలాసోర్	1,480
ఖరగ్‌పూర్	1,075

ప్రబోధ సేవా సమితి సభ్యులు అరెస్టు

- సభ్యులంతా శ్రీకాకుళం జిల్లాకు చెందినవారు



అరెస్టైన సేవా సమితి సభ్యులు

పర్లాకిమిడి: ప్రబోధ సేవా సమితి ఆశ్రమం (అనంతపురం) సభ్యులు హిందూ ధర్మం, త్రైత సిద్ధాంత భగవద్గీత, గురు ప్రార్థన మంజరి, ప్రబోధం వంటి పుస్తకాలను పర్లాకిమిడిలో గురువారం ఇంటింటికీ అందజేశారు. అయితే ఈ పుస్తకాల్లో కొన్ని తప్పులు ఉన్నాయని, వీటిని ప్రచారం చేయడం ద్వారా హిందువుల మనోభావాలు దెబ్బతింటాయని భజరంగ దళ్ సభ్యులు స్థానిక ఆదర్శ పోలీసుస్టేషన్‌లో ప్రబోధ సేవా సమితి సభ్యులపై కేసు పెట్టారు. దీంతో పెద్ద బ్రాహ్మణ వీధిలో శ్రీకాకుళం జిల్లాకి చెందిన 12 మంది సేవా సమితి సభ్యులను పోలీసులు మధ్యాహ్నం అరెస్టు చేశారు. వీరిలో మహిళలు ఆరుగురు, పురుషులు ఆరుగురు ఉన్నారు. వీరంతా పర్లాకిమిడి, నరసన్నపేట, పోలాకి, కోటబొమ్మాళి గ్రామాలకు చెందినవారు. శుక్రవారం వారిని కోర్టుకు తరలించనున్నట్లు సమాచారం.

మెట్రిక్యులేషన్ ఫలితాలు విడుదల

- 96.19 శాతం ఉత్తీర్ణత
- 3,222 పాఠశాలల్లో 100 శాతం ఉత్తీర్ణత
- బాలికలదే పైచేయి



ఫలితాలు విడుదల చేస్తున్న మంత్రి ప్రమీలా మల్లిక్ తదితరులు

భువనేశ్వర్: రాష్ట్ర మాధ్యమిక విద్యా బోర్డు (బీఎస్‌ఈ) మెట్రిక్యులేషన్/వార్షిక హైస్కూల్ సర్టిఫికేట్ (హెచ్‌ఎస్‌సీ) పరీక్ష ఫలితాలను గురువారం ప్రకటించింది. ఈ పరీక్షల ఉత్తీర్ణత శాతం 96.19 శాతం నమోదు అయింది. ఉదయం 10 గంటలకు బోర్డు ప్రధాన కార్యాలయంలో రాష్ట్ర పాఠశాలలు – సామూహిక విద్యా విభాగం మంత్రి ప్రమీలా మల్లిక్ ఫలితాలను అధికారికంగా ప్రకటించారు. ఈ సందర్భంగా ఆమె ఫలితాల సంచికను ఆవిష్కరించారు. పరీక్షలకు హాజరైన 5,21,444 మంది విద్యార్థుల్లో 5,12,460 మంది ఉత్తీర్ణులయ్యారు. బాలికల ఉత్తీర్ణత 97.05 శాతం కాగా, బాలురు ఉత్తీర్ణత 95.75 శాతానికి పరిమితమైంది. కటక్, జగత్‌సింగ్‌పూర్ జిల్లాల్లో విద్యార్థులు అత్యధిక ఉత్తీర్ణత సాధించడం విశేషం. ఈ జిల్లాల్లో 97.99 శాతం ఉత్తీర్ణత నమోదు అయింది. 92.68 శాతం ఉత్తీర్ణతతో మల్కన్‌గిరి జిల్లా అట్టడుగున నిలిచింది. రాష్ట్రంలో 3,222 పాఠశాలలు 100 శాతం ఉత్తీర్ణత సాధించాయి.

ఫిర్యాదులకు అవకాశం

విద్యార్థులు తమ ఫలితాల్లో ఏదైనా సమస్య ఉన్నట్లు గుర్తిస్తే ఫలితాలు ప్రచురించిన నెల రోజుల్లోపు పరీక్ష కంట్రోలర్‌తో ఫిర్యాదులను నమోదు చేయాలని సూచించారు. ఈ నేపథ్యంలో విద్యార్థుల కోసం బోర్డు కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసింది. ఈ కేంద్రం ఏడు రోజుల పాటు నిరవధికంగా పని చేస్తుంది. కంట్రోల్ రూమ్ ఫోన్ నంబర్ 0671–2415460గా తెలియజేశారు. ఈ ఏడాది మార్చి 10 నుంచి 20వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా 3,218 పరీక్షా కేంద్రాల్లో 5 లక్షల 32 వేల మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. ఈ సంవత్సరం 11,302 మంది విద్యార్థులు గైర్హాజరు కాగా, గతేడాది 45,000 మంది పరీక్షలకు గైర్హాజరు అయినట్లు విశ్లేషించారు. ఈ పరిస్థితులను నివారించేందుకు అనుబంధ విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు వచ్చే వారం నుండి కౌన్సిలింగ్ సెషన్ నిర్వహించనున్నట్లు బోర్డు ప్రకటించింది. గైర్హాజరైన విద్యార్థులు ఒక విద్యా సంవత్సరం వృథా చేసుకోకుండా ఉండేందుకు ప్రత్యామ్నాయ సౌకర్యాలపై అవగాహన పెంపొందించడమే ఈ కార్యక్రమం లక్ష్యంగా బోర్డు పేర్కొంది.

ఏ–1 గ్రేడ్‌లో 4,158 మంది

ఈ ఏడాది పరీక్షకు హాజరైన విద్యార్థుల్లో ఏ–1 గ్రేడ్‌లో 4,158 మంది, ఏ–2 గ్రేడ్‌లో 29,855 మంది, బీ–1లో 77,762 మంది, బీ–2లో 1,19,120 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. ఈ ఏడాది ఇన్‌స్టాంట్ పరీక్ష కోసం మొత్తం 3,627 మంది అభ్యర్థులు ఫారమ్‌లను నింపారు. వీరిలో 479 మంది అభ్యర్థులు గైర్హాజరు కాగా, ఏ–1 గ్రేడ్‌లో 3,117 మంది, ఏ–2లో 14 మంది, బీ–1లో 589 మంది, బీ–2లో 834 మంది ఉత్తీర్ణత సాధించారు. ఇన్‌స్టాంట్ పరీక్షల్లో సమగ్రంగా 85.94 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఈ సందర్భంగా మంత్రి మల్లిక్ మాట్లాడుతూ ఈ ఏడాది సప్లిమెంటరీ పరీక్షకు ఏర్పాట్లు చేశామన్నారు. పరీక్షల నిర్వహణలో సంస్కరణలకు సంబంధించి త్వరలో తుది నిర్ణయం ప్రకటిస్తుందని వెల్లడించారు. మూల్యాంకనంలో ఎలాంటి లోపం లేదని మాస్ ఎడ్యుకేషన్ సెక్రటరీ అశ్వతి ధృవీకరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బోర్డు ప్రెసిడెంట్ రామశిష్ హజ్రా, వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ నిహార్ రంజన్ మహంతి, కార్యదర్శి సుమితా సర్కార్, ఎగ్జామినేషన్ కంట్రోలర్ సుస్మితా సాహు, నిరంజన్ బెహరా తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కన్సల్టేటివ్ కమిటీ ఏర్పాటు

రాయగడ: రాయగడ రైల్వేస్టేషన్ కన్సల్టేటివ్ కమిటీ ఏర్పాటయ్యింది. ఈ మేరకు వాల్తేర్ ఈస్టుకోస్టు రైల్వే అసిస్టెంట్ కమర్షియల్ మేనేజర్ గురువారం ఒక ప్రకటనలో తెలియజేశారు. కమిటీలో సభ్యులుగా హేమంత్ గౌలాని, అఖిల్ రంజన్ పండ, గోవింద ప్రసాద్ రోథా, ఎస్.వి.శివ, బి.శరత్ కుమార్, ఇప్పిలి సన్యాసిరాజు, కిషోర్‌చంద్ర పండ, చిన్నారి కృష్ణమూర్తి, పార్థవర్ధన్‌లు నియమితులయ్యారు. వీరు ప్రయాణికుల సమస్యలు తెలుసుకొని, అధికారుల దృష్టికి తీసుకెళ్తారు.

డాక్టర్ బీరేన్ నాయక్ మృతి



రాయగడ: స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో సర్జరీ స్పెషలిస్టుగా గత మూడేళ్లుగా సేవలందిస్తున్న డాక్టర్ బీరేన్ నాయక్ (51) బుధవారం రాత్రి మృతి చెందారు. కొద్ది రోజుల క్రితం తీవ్ర అస్వస్థతకు గురైన ఆయన, హైదరాబాద్‌లోని అపోలో ఆస్పత్రిలో చికిత్స తీసుకుంటూ మరణించారు. ఆయన మృతిపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తున్నట్లు ప్రభుత్వ వైద్య బృందం ఒక ప్రకటనలో పేర్కొంది. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. వారంతా బరంపురంలో నివసిస్తున్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ



దొంగతనం జరిగిన ఇల్లు

మల్కన్‌గిరి: జిల్లాలోని మల్కన్‌గిరి సమితి ఎంవీ 20 గ్రామంలో నివాసముంటున్న సంజయ్ గణే అనే వ్యక్తి కుటుంబంతో కలిసి సోమవారం ఉమ్మర్‌కోట్ వెళ్లారు. దీంతో బుధవారం రాత్రి తాళం వేసివున్న ఆయన ఇంట్లోకి దుండగులు ప్రవేశించి రూ.3 లక్షల నగదు, నగలను చోరీ చేశారు. గురువారం ఉదయం ఇరుగుపొరుగు వారు విషయం గమనించి, సంజయ్‌కు ఫోన్ చేసి చెప్పారు. వెంటనే ఆయన మల్కన్‌గిరి వచ్చి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఐఐసీ రీగాన్‌కీండో సంఘటన స్థలాన్ని పరిశీలించి దర్యాప్తు ప్రారంభించారు.

ఉపాధి వేతనదారులపై తేనెటీగల దాడి



తేనెటీగల దాడిలో గాయపడిన వేతనదారులకు చికిత్స అందిస్తున్న వైద్యసిబ్బంది

కురుపాం: కురుపాం పంచాయతీ శివ్వన్నపేట గ్రామ సమీపంలో గురువారం ఉపాధి పనులు చేస్తున్న వేతనదారులపై తేనె టీగలు దాడి చేయడంతో నలుగురికి గాయాలయ్యాయి. గ్రామ సమీపంలో ఏకలవ్య పాఠశాల సమీపంలో ఉపాధి పనులు చేస్తున్న బి.గౌరి, ఎం.లక్ష్మి, ఎం.జగదీశ్వరి, బి. విఘ్నేశ్వరరావులపై ఒక్కసారిగా తేనెటీగలు దాడి చేయడంతో పరుగులు పెట్టి వెంటనే స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రానికి చికిత్స కోసం వెళ్లగా వైద్య సిబ్బంది ప్రథమ చికిత్స అందించారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

జియ్యమ్మవలస: మండలంలోని చినమేరంగి గ్రామంలో శ్రీహరి గౌడౌన్‌లో అక్రమంగా నిల్వ ఉంచిన 20 బస్తాల పీడీఎస్ బియ్యాన్ని చినమేరంగి పోలీసులు గురువారం పట్టుకున్నారు. ముందస్తు సమాచారం అందడంతో ఎస్సై కళాధర్ సిబ్బందితో కలిసి రైడింగ్ చేసి వారివద్ద నిల్వ ఉంచిన బియ్యాన్ని స్వాధీనం చేసుకున్న తహసీల్దార్‌కు అప్పగించారు.

యువత క్రీడల్లో రాణించాలి



విన్నర్ జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న దృశ్యం



మాట్లాడుతున్న మాజీ ఎంపీ నెక్కంటి

రాయగడ: యువత క్రీడల్లో రాణించాలని మాజీ ఎంపీ నెక్కంటి భాస్కరరావు పిలుపునిచ్చారు. సదరు సమితి సందుబడిలో సందుబడి యువజన సంఘం ఆధ్వర్యంలో ఏప్రిల్ 30వ తేదీ నుంచి జరుగుతున్న క్రికెట్ టోర్నమెంట్ గురువారంతో ముగిసింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన నెక్కంటి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం క్రీడా రంగానికి పెద్దపీట వేస్తోందన్నారు. ఇటువంటి మహోత్తర అవకాశాన్ని క్రీడాకారులు సద్వినియోగం చేసుకొని ఉజ్వల భవిష్యత్‌ను తీర్చిదిద్దుకోవాలని సూచించారు. అయితే క్రీడారంగంలో రాణించాలంటే నిత్యం సాధన అవసరమని పేర్కొన్నారు. గౌరవ అతిథిగా పాల్గొన్న మాజీ మంత్రి లాల్ బిహారి హిమిరిక మాట్లాడుతూ జిల్లాలో ఎంతోమంది క్రీడాకారులు ఉన్నారని, అయితే వారికి సకాలంలో ప్రోత్సాహం అందక క్రీడాస్ఫూర్తి తగ్గుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని పేర్కొన్నారు.. టోర్నమెంట్‌లో మొత్తం 48 జట్లు పాల్గొనగా, ఫైనల్స్‌లో సందుబడి, తంబలిబాయి తలపడ్డాయి. వీరిలో తంబలిబాయి జట్టు విజయం సాధించింది. విన్నర్ జట్టుకు రూ.30 వేలు, రన్నర్ జట్టుకు రూ.20 వేల నగదుతో పాటు ట్రోఫీలు అందజేశారు. కార్యక్రమంలో రాయగడ సమితి వైస్ చైర్మన్ హరప్రసాద్ హెప్రుక, జిల్లా పరిషత్ మాజీ అధ్యక్షుడు గంగాధర్ పువ్వల, బీజేడీ సీనియర్ నాయకుడు చంద్రకాంత్ సామల్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ మైనింగ్‌పై ఆందోళన



ఆందోళన చేస్తున్న సీపీఎం నాయకులు

కొరాపుట్: అక్రమ గనుల తవ్వకాలను వ్యతిరేకిస్తూ ఆంధ్రా-ఒడిశా వివాదస్పద ప్రాంతం కొఠియాలో సీపీఎం పార్టీ గురువారం ఆందోళన నిర్వహించింది. కొరాపుట్ జిల్లా పొట్టంగి సమితి కొఠియా గ్రామ పంచాయతీ పట్టు చెన్నూరు గ్రామ సమీపంలోని శిఖ పరువు గ్రామం వద్ద ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పార్వతీపురం మన్యం జిల్లా సాలురు మండల కమ్యూనిస్టులు నిరసన చేపట్టారు. అక్రమ మైనింగ్‌లను రద్దు చేయాలని, గిరిజన భూములకు రక్షణ కల్పించాలని, గిరిజనులను రక్షించాలని, వేధింపులకు గురిచేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. షెడ్యూల్డ్ గ్రామాలను కూడా లెక్క చేయకుండా రాజ్యాంగానికి విరుద్ధంగా నిబంధనలు ఉల్లంఘించి మంగనీస్ గనుల అక్రమ మైనింగ్‌కి పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. 1956లో అప్పటి రాష్ట్రపతి ఆమోదంతో కూడుకున్న గ్రామసభ పంచాయతీ రాజ్ యాక్ట్‌లను తుంగలో తొక్కి గిరిజనులకు హక్కులు లేకుండా చేస్తున్నారని మండిపడ్డారు. ఆందోళనలో ఆ పార్టీ నాయకులు కోనేటి లక్ష్మణ శంభు, సీహెచ్ డిప్పాయమ్మ కాంగ్, మర్రి శ్రీనివాసరావు, కోరాడ ఈశ్వరరావు, చోడిపల్లి భీషూ తదితరులు పాల్గొన్నారు.

కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు



హాజరైన బంకుల యజమానులు

- సబ్ కలెక్టర్ సాబొరొ



మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ సాబొరొ తదితరులు

రాయగడ: పట్టణంలోని బంకుల్లో పెట్రోల్, డీజిల్ కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు తప్పవని సబ్ కలెక్టర్ భీమసేన్ సాబొరొ హెచ్చరించారు. ఇటీవల తరుచూ పెట్రోల్, డీజిల్ కొరతతో వినియోగదారులు ఇబ్బందులు పడుతుండడంతో, పెట్రోల్ బంకుల యజమానులతో సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా కొరత ఏర్పడడానికి గల కారణాలు గురించి ఆరా తీశారు. ప్రస్తుతం పెట్రోల్ అనేది నిత్యావరసర వస్తువుగా మారిపోయిందని, అందువలన నిరంతరం సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. బంకుల్లో ప్రభుత్వ నిబంధనలు తప్పనిసరిగా అమలు చేయాలని ఆదేశించారు. సమావేశంలో ఎస్‌డీపీవో దేవజ్యోతి దాస్, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి రాజ్‌కిషోర్ పాణిగ్రహి, ఏసీఎస్‌వో సరోజ్ కుమార్ సాహు, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు దుర్గా ప్రసాద్ పండ, ఐవోసీఎల్ మేనేజరు శ్రీవర్ధన్ పాలియా తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం



చికిత్స పొందుతున్న ధనుంజయనాయుడు

పార్వతీపురం: భార్య మద్యం తాగవద్దని మందలించినందుకుగాను భర్త ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గురువారం జరిగిన ఈ సంఘటనపై పార్వతీపురం ఆస్పత్రి అవుట్‌పోస్టు పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మద్యం తాగి గ్రామంలో తిరగవద్దని పార్వతీపురం మండలం పెదబొండపల్లి గ్రామానికి చెందిన యాళ్ల ధనుంజయనాయుడిని భార్య లక్ష్మి మందలించినందుకు ఇద్దరిమధ్య చిన్నపాటి గొడవ జరిగింది. దీంతో మనస్తాపం చెందిన భర్త ధనుంజయనాయుడు భార్య ఇంట్లో సమయంలో పెయిన్ కిల్లర్స్ ఒక్కసారిగా తినేసి ఆత్మహత్యాయత్నం చేశాడు. అదే సమయంలో వచ్చిన భార్య గమనించి 108 వాహనంద్వారా పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి చికిత్స కోసం తరలించింది.

విద్యార్థుల అభ్యున్నతికి ఎంఓయూలు దోహదం

నెల్లిమర్ల రూరల్: విద్యార్థుల అభ్యున్నతికి ఎంఓయూలు ఎంతో దోహదపడతాయని సెంచూరియన్ వీసీ ప్రొఫెసర్ జీఎస్ఎన్ రాజు అన్నారు. మండలంలోని టెక్కలి సెంచూరియన్‌లో రెయిన్‌బో సంస్థతో గురువారం ఎంఓయూ కుదుర్చుకున్నారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ఎంఓయూ వలన విద్యార్థులకు ఉపాధి అవకాశాలు, ఇంటర్న్‌షిప్, ప్రాజెక్టులు, పరిశోధనా రంగాల్లో సహకారం ఉంటుందన్నారు. కార్యక్రమంలో రెయిన్‌బో సంస్థ ఎండీ డాక్టర్ నాదేళ్ల గిరి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రమణారావు, డీన్ ప్రొఫెసర్ లక్ష్మీనరసింహాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

వైజ్ఞానిక శిక్షణ తరగతులు జయప్రదం చేయాలి



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాగభూషణం తదితరులు

బొబ్బిలి: ఈనెల 28 నుంచి 31 వరకూ విశాఖపట్నంలో జరిగే వైజ్ఞానిక శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఎన్.నాగభూషణం కోరారు. ఈ మేరకు గురువారం పట్టణంలో దీనికి సంబంధించిన వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున విద్యార్థులు హాజరు కావాలని పిలుపునిచ్చారు. అలాగే ప్రభుత్వ సూచనలు పట్టించుకోకుండా కార్పొరేట్ స్కూళ్లలో పుస్తకాలు, యూనిఫాం, ఇతర పరికరాలను విక్రయిస్తూ తమ వద్దే కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తున్న కార్పొరేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి బి.రవికుమార్, హరి, ప్రవీణ్,గౌరి,వినయ్ తదితరులున్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తా చాటాలి



రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైన జిల్లా జట్టు

- కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు

విజయనగరం: ఈనెల 20,21 తేదీల్లో విజయనగరంలోని రాజీవ్ క్రీడా ప్రాంగణంలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే అండర్ -19 జిల్లా బాల బాలికల జట్లు ఎంపిక గురువారం పూర్తయింది. ఈ సందర్భంగా జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు ఈశ్వర్ కౌశిక్, కార్యదర్శి కాళ్ల సూరిబాబు, డీవీఈవో సురేష్‌బాబు, అండర్ 19 స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి కృష్ణ మాట్లాడుతూ రాష్ట్రస్థాయి పోటీల్లో క్రీడాకారులు సత్తా చాటాలని ఆకాంక్షించారు. ఎంపిక ప్రక్రియలో కబడ్డీ అసోసియేషన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి పి. శ్రీనివాసరావు, బొమ్మన రామారావు, స్కూల్‌గేమ్స్ కార్యదర్శి ఎల్.వి. రమణ పాల్గొన్నారు.

'ఆరోగ్య గాయత్రీ' పేరుతో ఉచిత వైద్యసేవలు



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న బ్రాహ్మణ సమాఖ్య ప్రతినిధులు

- 21న డిప్యూటీ స్పీకర్ చేతుల మీదుగా ప్రారంభం

విజయనగరం టౌన్: బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య ఆధ్వర్యంలో ఈ నెల 21న ఆదివారం ఉదయం 7.30 గంటలకు గాయత్రీ భవనంలో 'ఆరోగ్య గాయత్రీ' ఉచిత వైద్యశాల పేరుతో ఉచిత వైద్య సేవలు అందజేయనున్నట్లు సమాఖ్య గౌరవాధ్యక్షుడు డాక్టర్ డీవీ శ్రీకాంత్, అధ్యక్షుడు భోగరాజు బాబూజీ పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం గాయత్రీ భవన్‌లో కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కార్యక్రమాన్ని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి ప్రారంభిస్తారన్నారు. అందరికీ ఉచిత వైద్యసేవలతో పాటూ అందుబాటులో ఉన్న మందులను ఉచితంగా అందజేస్తామన్నారు. ప్రతీరోజు ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకూ రాజీవ్‌నగర్ కాలనీలో ఉన్న గాయత్రీభవనంలోనే వారానికి ఆరు రోజుల పాటూ (శనివారం తప్ప) వైద్యసేవలు అందుబాటులో ఉంటాయన్నారు. కార్యక్రమంలో సమాఖ్య ప్రతినిధులు ధవళ వెంకటరావు, భోగరాజు సూర్యలక్ష్మి, టిఎస్. ప్రకాశరావు, పి.రమణమూర్తి, వి.నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఏం జరిగిందో పాపం..!

- అనుమానాస్పద స్థితిలో యువతి మృతదేహం
- ఘటనా స్థలాన్ని పరిశీలించిన డీఎస్పీ గోవిందరావు



తుప్పల్లో పడిఉన్న ఉమామహేశ్వరి మృతదేహం






ఘటనా స్థలంలో విచారణ చేస్తున్న డీఎస్పీ గోవిందరావు, ఎస్సై ముకుందరావు, (ఇన్‌సెట్లో) ఉమామహేశ్వరి ఫైల్

లక్కవరపుకోట: మండలంలోని గోల్డ్‌స్టార్ జంక్షన్ నుంచి గేదులవానిపాలెం గ్రామం వెళ్లే రహదారిలో జమ్మాదేవిపేట సమీపంలో గల సరస్వతి లేఅవుట్ వద్ద కళ్లేపల్లి గ్రామానికి చెందిన వెలుగులో బుక్ కీపర్ గోకేడ ఉమామహేశ్వరి(29) అనుమానస్పద స్థితిలో మృతిచెందింది. గురువారం వెలుగుచూసిన ఈ విషయం తెలుసుకున్న మండల వాసులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. స్థానికులు, ఎస్సై ముకుందరావు తెలియజేసిన మేరకు వివరాలిలా ఉన్నాయి. సరస్వతి లేఅవుట్ సమీపంలో చిలకావాని చెరువులో ఉపాధి హామీ కూలీలు పనిచేస్తున్నారు. వారిలో ఒక కూలీ సేద తీరేందుకు పక్కనే గల గట్టువద్దకు వచ్చి నిలబడి సమీపంలో మృతదేహాన్ని గుర్తించి తోటి కూలీలకు తెలిపాడు. వెంటనే వారు పోలీసులకు సమాచారం అందించగా ఘటనా స్థలానికి డీఎస్పీ ఆర్.గోవిందరావు, ఎస్సై ముకుందరావులు సిబ్బందితో చేరుకుని విచారణ ప్రారంభించారు. మృతదేహం ఫొటోను వాట్సాప్ గ్రూప్‌లో సెండ్‌చేయుగా కళ్లేపల్లి గ్రామానికి చెందిన గోకేడ ఉమామహేశ్వరిగా కొంతమంది గుర్తించారు. వెంటనే మృతురాలి కుటుంబసభ్యులకు విషయం చేరవేయగా వారు ఘటనా స్థలానికి చేరుకుని ఉమామహేశ్వరిగా గుర్తించారు. ఇదిలా ఉండగా విజయనగరం జిల్లా కేంద్రంలో వెలుగు ఆధ్వర్యంలో సమావేశం ఉందని ఉమామహేశ్వరి బుధవారం ఉదయం 9 గంటలకే ఇంటి నుంచి బయల్దేరి వెళ్లింది. రాత్రికి ఇంటికి రాకపోవడంతో ఆరా తీయగా ఆమె సమావేశానికి హాజరుకాలేదని అధికారులు తెలిపారు. దీంతో కుటుంబసభ్యులు వెతకడం ప్రారంభించారు. అనుమానాస్పద స్థితిలో మృతదేహం లభ్యమైన తరువాత ఆమెను ఎక్కడో చంపేసి మృతదేహాన్ని ఇక్కడికి తీసుకొచ్చి పడేసి ఉంటారని పోలీసులు భావించారు. క్లూస్ టీమ్, డాగ్‌స్క్వాడ్‌లు వచ్చి పరిసర ప్రాంతాల్లో పరిశీలించినప్పటికీ ఎటువంటి ఆధారాలు లభించేలేదు. మృతురాలి భర్త నాయుడు ప్రైవేట్ సంస్థలో పనిచేస్తున్నాడు.

బిక్కుబిక్కుమంటూ ఇద్దరు పిల్లలు

కాగా మృతురాలికి నవనీత్ (13),సాద్విక్ (12) ఇద్దరు మగ పిల్లలు కలరు. మా అమ్మ విజయనగరం మీటింగ్‌కు వెళ్లింది తిరిగి వస్తుందని చెప్పడంతో అక్కడ ఉన్న వారు కన్నీటిపర్యంతమయ్యారు. ఈ ప్రాంతంలో గతంలో ఎప్పుడూ ఈ తరహా ఘటనలు జరగకపోవడంతో మండలవాసులు భయభ్రాంతులకు లోనయ్యారు. పోలీసులు శవపంచనామా నిర్వహించి పోస్టుమార్టం కోసం మృతదేహాన్ని ఎస్.కోట సీహెచ్‌సీకి తరలించారు.

విద్యుత్ షాక్‌తో ఎలక్ట్రీషియన్..



అప్పలరాజు మృతదేహం

విజయనగరం ఫోర్ట్: విద్యుత్ షాక్‌తో ఓ ప్రైవేట్ ఎలక్ట్రీషియన్ మృతి చెందాడు. నగరంలోని కేఎల్‌పురంలో ఓ ఇంటికి విద్యుత్ సరఫరా వచ్చి పోతుండడంతో యాజమాని పక్క వీధిలో ఉన్న ప్రైవేట్ ఎలక్ట్రీషియన్ టెక్కలి అప్పలరాజు (40)ను తీసుకొచ్చాడు. అక్కడ మూడు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ఉండగా ఆపాల్సిన ట్రాన్స్‌ఫార్మర్ కాకుండా వేరే ట్రాన్స్‌ఫార్మర్ విద్యుత్ సరఫరా నిలిపివేసి విద్యుత్ పోల్ ఎక్కడంతో ఒక్కసారిగా విద్యుత్ ప్రవహించగా షాక్‌కు గురై కింద పడిపోవడంతో గాయాలయ్యాయి. వెంటనే గృహ యజమాని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి తరలించగా ప్రథమ చికిత్స అనంతరం కేజీహెచ్‌కు తీసుకువెళ్తుండగా మార్గమధ్యంలో చనిపోయాడు. విద్యుత్ పోల్ ఎక్కిన ఎలక్ట్రీషియన్ విద్యుత్‌శాఖకు సంబంధించిన వ్యక్తి కాదని ఎస్‌ఈ నాగేశ్వరావు తెలిపారు. అనధికారిగా విద్యుత్ పోల్ ఎక్కితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. విద్యుత్ సమస్యల నివారణ కోసం 1912 ట్రోల్ ఫ్రీ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

గుర్తు తెలియని యువకుడు..

గజపతినగరం: గజపతినగరం రైల్వే స్టేషన్ యార్డులో గుర్తు తెలియని యువకుడు(23)మృతి చెందాడు. ఈ ఘటనపై విజయనగరం రైల్వే ఎస్సై వి.రవివర్మ మాట్లాడుతూ అనారోగ్యం వల్ల గానీ, వడదెబ్బ వల్ల గాని మృతి చెంది ఉండవచ్చన్నారు. మృతుడి శరీరంపై ఎటువంటి గాయాలు లేవని, పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి..

బొబ్బిలి: గరుగుబిల్లి మండలం నాగూరుకు చెందిన అక్కేన తవిటినాయుడు(53) ఈనెల 9న తెర్లాం మండలం నందబలగ వెళ్లి వస్తుండగా కారాడ వద్ద కోళ్లవ్యాన్ ఢీకొనడంతో ప్రమాదానికి గురయ్యాడు. ప్రాథమిక చికిత్స అనంతరం విశాఖ కేజీహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందినట్టు ఎస్సై చదలవాడ సత్యనారాయణ తెలిపారు.

మబ్బే.. మసకేసిందిలే...!



పట్టణంలో గురువారం సాయంత్రం కారు మబ్బులు, గాలులతో ప్రజలు ఎండ వేడిమి నుంచి ఉపశమనం పొందారు. అయితే చిన్న వర్షపు జల్లులు మాత్రమే రావడంతో కాస్త నిరాశకు గురయ్యారు. ఏదేమైనా గత వారం రోజులుగా ఎండతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న పర్లాకిమిడి ప్రజలకు తేలికపాటి వర్షంతో కాస్త ఊరట కలిగింది. సావిత్రి అమావాస్య తర్వాత వర్షాలు పడవచ్చని ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

- పర్లాకిమిడి

క్లుప్తంగా

ఏపీ టిడ్కో డైరెక్టర్‌గా గోవిందరావు


ఖండాపు గోవిందరావు

బూర్జ: మండలంలోని మదనాపురం గ్రామానికి చెందిన ఖండాపు గోవిందరావు ఏపీ టిడ్కో డైరెక్టర్‌గా నియమితులయ్యారు. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ టౌన్‌షిప్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డిపార్ట్‌మెంట్(ఎంఏయూడీ, విజయవాడ) నుంచి గురువారం ఉత్తర్వులు అందినట్లు ఒక ప్రకటన విడుదల చేశారు. రెండేళ్లపాటు పదవిలో కొనసాగనున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనను గుర్తించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, స్పీకర్ తమ్మినేని సీతారాంకు, యువనేత తమ్మినేని చిరంజీవినాగ్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. గోవిందరావుకు ఎంపీపీ కర్నేన దీప, జెడ్పీటీసీ బెజ్జిపురపు రామారావు, ఎంపీడీఓ ఎం.రవీంద్రబాబు, తహశీల్దార్ ఎస్.రమణారావు, మండల ప్రత్యేక ఆహ్వానితుడు కర్నేన నాగేశ్వరరావు, వైస్ ఎంపీపీలు బుడుమూరు సూర్యారావు, కరణం కృష్ణమూర్తి నాయుడు, డీసీఎంఎస్ డైరెక్టర్ జల్లు బలరాం నాయుడు, పీఏసీఎస్ అధ్యక్షుడు బగాది నారాయణమూర్తి, మండల ప్రధాన కార్యదర్శి ఇసాయి వెంకటరావు, మండల కన్వీనర్ల కోఆర్డినేటర్ గుమ్మడి రాంబాబు అభినందనలు తెలిపారు.

దూరవిద్య కేంద్రం పరీక్షల నోటిఫికేషన్ విడుదల

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం దూరవిద్య కేంద్రం నిర్వహించే యు.జి, పి.జి, ప్రొఫెషనల్, డిప్లమా, పీజీ డిప్లమా, కంప్యూటర్ సర్టిఫికెట్ కోర్సుల పరీక్షల నోటిఫికేషన్ విడుదల చేసినట్లు దూరవిద్య కేంద్రం ఇన్‌చార్జి సంచాలకులు ఎం.వి.ఎస్ చంద్రశేఖరరావు ఒక ప్రకటనలో తెలిపారు. 2020-21, 2021-22, 2022-23 విద్యాసంవత్సరంలో ప్రవేశం పొందిన వారు 2017-18 విద్యా సంవత్సరం తరువాత చేరి బ్యాక్‌లాగ్‌లు ఉన్న విద్యార్థులు సైతం దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. జూన్ 10వ తేదీలోగా ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. రూ.500 అపరాధ రుసుంతో జూన్ 15వ తేదీ వరకు దరఖాస్తులను స్వీకరిస్తామని తెలిపారు. రూ.2000 అపరాధ రుసుముతో జూన్ 20వ తేదీ వరకు దరఖాస్తులను స్వీకరిస్తామని చెప్పారు. పూర్తి వివరాలకు వెబ్‌సైట్ www.andhrauniversity.sde.com, 0891 2844163, 2844164, 2754966 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

పరీక్షల తేదీలు..
డిగ్రీ మూడో సంవత్సరం, ఎంబీఏ, ఎంసీఏ మూడో సంవత్సరం పరీక్షలు జూలై 3 నుంచి ఉదయం 9 నుంచి 12 గంటల వరకు నిర్వహిస్తారు. డిగ్రీ ద్వితీయ సంవత్సరం, ఎంబీఏ, ఎంసీఏ, ఇతర పీజీ కోర్సుల ద్వితీయ సంవత్సరం పరీక్షలు జూలై 3 నుంచి మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు నిర్వహిస్తారు. ప్రథమ సంవత్సరం యూజీ, పీజీ, డిప్లమా, పీజీ డిప్లమా, సర్టిఫికెట్ కోర్సుల పరీక్షలు జూలై 18 నుంచి మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు నిర్వహిస్తారు.

మిస్టర్ ఆంధ్రా పోటీల్లో హవా


పతకాలు సాధించిన బాడీబిల్డర్లతో ప్రతినిధులు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా బాడీబిల్డింగ్ క్రీడాకారులు హవా కనబర్చారు. పాడేరులో ఈ నెల 15న జరిగిన మిస్టర్ ఆంధ్ర బాడీబిల్డింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో శ్రీకాకుళం నుంచి ప్రాతినిధ్యం వహించిన బిల్డర్లు పతకాలు కైవసం చేసుకున్నారు. వీరిని గోపాల్ ఫిట్‌నెస్ అధినేత గోపాల్ గురువారం అభినందించారు. 55 కేజీల విభాగంలో ఆరుగుల జ్యోతికుమార్ (శ్రీకాకుళం) ప్రథమ, అబ్దుల్ ఖాన్ (శ్రీకాకుళం) తృతీయ, 65 కేజీల విభాగంలో బట్న నవీన్‌కుమార్ (వప్పంగి) ప్రథమ, 65 కేజీల విభాగంలో షేక్ మదీనా (రణస్థలం) నాలుగో స్థానం, 75 కేజీల విభాగంలో సందీప్‌కుమార్ మూడో స్థానంలో నిలిచారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ బాడీబిల్డర్స్ అసోసియేషన్ అసోసియేట్ సెక్రటరీ వి.విజయ్‌కుమార్, శ్రీకాకుళం జిల్లా అధ్యక్షులు బి.ప్రసాద్, టీమ్ మేనేజర్ కె.గౌరీశంకర్ తదితరులు అభినందించారు.

పేషెంట్ రిలేషన్ అసోసియేట్ కోర్సులో ఉచిత శిక్షణ

శ్రీకాకుళం రూరల్: మండల పరిధిలోని రాగోలు జెమ్స్ ఆస్పత్రి బొల్లినేని మెడిస్కిల్స్‌లో బీఎస్సీ, బీకాం పాసైన విద్యార్థులకు పేషెంట్ రిలేషన్ అసో సియేట్ కోర్సులో మూడు నెలల ఉచిత శిక్షణ అందించి కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఉద్యోగాలు కల్పించనున్నట్లు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్ నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీఎస్ఎస్‌డీ, సీడాప్ సహకారంతో ఎచ్చెర్లలోని టీటీడీసీలో శిక్షణ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 18 నుంచి 30 ఏళ్లల్లో వు యువతీ యువకులు అర్హులని తెలిపారు.

శిక్షణ కాలంలో ఉచిత వసతి, భోజనం, యూనిఫారం, బీమా సౌకర్యం కల్పిస్తామని పేర్కొన్నారు. ఇంటర్ పాసైన వారికి తొమ్మిది బీఎస్సీ పారామెడికల్ కోర్సుల్లో నర్సింగ్, ఎంఎల్‌టీ, బీపీటీ కోర్సుల్లో ప్రవేశాలు జరుగుతున్నాయని తెలిపారు. పూర్తి వివ రాలకు 9121999654, 7680945357 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

ఇంటర్ సప్లిమెంటరీకి సన్నద్ధం

- 24 నుంచి పరీక్షలు మొదలు
- 86 కేంద్రాలు కేటాయింపు
- హాజరుకానున్న 31,572 మంది విద్యార్థులు

శ్రీకాకుళం న్యూకాలనీ:

ఇంటర్మీడియెట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణకు అధికార యంత్రాంగం పకడ్బందీ ఏర్పాట్లు చేస్తోంది. ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలో ఈ నెల 24 నుంచి మొదలుకానున్న పరీక్షల కోసం 86 కేంద్రాలు కేటాయించారు. ఎండల నేపథ్యంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పకడ్బందీగా చర్యలు తీసుకుంటున్నారు. కాగా ప్రభుత్వ కళాశాలల్లో ఉత్తీర్ణత శాతాన్ని పెంచేలా కలెక్టర్ ప్రత్యేకంగా దృష్టిసారించారు. ప్రభుత్వ సూచనలు, కలెక్టర్ ఆదేశాలతో రెమీడియల్ క్లాసులు నిర్వహిస్తున్నారు.


ప్రభుత్వ కళాశాలలో రెమీడియల్ క్లాసులు నిర్వహిస్తున్న దృశ్యం

86 కేంద్రాల్లో..
అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు జిల్లా నుంచి మొత్తం 31,572 మంది విద్యార్థులు హాజరవుతున్నారు. వీరిలో ప్రథమ సంవత్సరం విద్యార్థులు 20,333 మంది, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 11,239 మంది ఉన్నారు. అలాగే పరీక్షల నిర్వహణకు 86 కేంద్రాలను కేటాయించారు.

కేంద్రాలపై ప్రత్యేకంగా ఫోకస్..
పరీక్షలపై ప్రభుత్వ ఆదేశాల మేరకు అధికారులు పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నారు. పరీక్షల నిర్వహణకు సిబ్బందిని నియమించారు. 86 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 86 మంది డిపార్ట్‌మెంటల్ అధికారులు, 20 మంది కస్టోడియన్లను నియమిస్తున్నారు. 38 స్టోరేజ్ పాయింట్లతో ప్రశ్నాపత్రాలను భద్రపరిచారు. జిల్లా పరిశీలకులు, డీఈఓ కోట ప్రకాశరావు, డీఈసీ కమిటీ కన్వీనర్‌గా ఆర్‌ఐవో ఎస్.తవిటినాయుడు, సభ్యులుగా ఇతర సీనియర్ ప్రిన్సిపాళ్లు వ్యవహరిస్తున్నారు. హైపవర్ కమిటీ, రాష్ట్ర పరిశీలకులు హాజరుకానుండగా.. నాలుగు ఫ్లయింగ్ స్క్వాడ్, మరో నాలుగు సిట్టింగ్ స్క్వాడ్ బృందాలను నియామకం చేశారు. పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. వీటిని ఇంటర్‌బోర్డు ఉన్నతాధికారులు పర్యవేక్షించేలా స్ట్రీమింగ్ చేశారు.

రెండు సెషన్లలో..
పరీక్షలను రెండు సెషన్లగా నిర్వహిస్తున్నారు. ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు జరగనున్నాయి. విద్యార్థులు వారికి కేటాయించిన కేంద్రానికి అర గంట ముందు చేరుకోవాలని, నిమిషం ఆలస్యమైనా లోనికి అనుమతించబోమని అధికారులు స్పష్టం చేస్తున్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉండనుంది. అలాగే మెడికల్ సిబ్బందిని అందుబాటులో ఉంచుతున్నారు. పరీక్ష కేంద్రాల్లో మంచినీరు, ఫర్నీచర్, ఇన్విజిలేటర్ల కొరత లేకుండా చర్యలు తీసుకుంటున్నారు.

కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు



ఇంటర్మీడియెట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నాం. డీఈసీ కమిటీ నేతృత్వంలో అధికారులు, సిబ్బందిని నియమిస్తున్నాం. అధిక ఎండలు, ఉక్కపోతల నేపథ్యంలో ప్రభుత్వం, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు కేంద్రాల్లో మౌలిక సదుపాయాలను పక్కాగా కల్పించేలా జాగ్రత్తలు తీసుకుంటున్నాం.
– ఎస్.తవిటినాయుడు, జిల్లా ఆర్ఐఓ, శ్రీకాకుళం

రెండు ఆటోలు ఢీకొని ముగ్గురికి గాయాలు

బూర్జ: మండలంలోగల సింగన్నపాలెం, ఉప్పినివలస గ్రామాల మధ్య ప్రధాన రహదారిపై గురువారం ఎదురెదురుగా వస్తున్న ఆటోలు ఢీకొన్న ఘటనలో ముగ్గురు గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. లచ్చయ్యపేటకు చెందిన గంగాడ పుణ్యవతి, ఎర్ర జయమ్మ ఆమదాలవలసలో కూలి పనులు చేసుకుని సాయంత్రం ఇంటికి తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ఇదే ఘటనలో తోటవాడకు చెందిన ఆటో డ్రైవర్ జమ్మల రాముకు కూడా తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న 108 ఈఎంటీ బి.పోలినాయుడు, పైలట్ సీహెచ్ మల్లేష్ క్షతగాత్రులను శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు.


క్షతగాత్రులను 108 వాహనంలో తరలిస్తున్న దృశ్యం

ఆటో బోల్తా..ఇద్దరికి గాయాలు
టెక్కలి రూరల్: మండలంలోని అయోధ్యపురం జాతీయ రహదారి సమీపంలో గురువారం కవిటి నుంచి టెక్కలి వైపు వస్తున్న ఆటో బోల్తాపడటంతో ఇద్దరు గాయపడ్డారు. కవిటి మండలం దూగానపుట్టుగకు చెందిన నలుగురు వ్యక్తులు ఆటోలో టెక్కలి వస్తుండగా అయోధ్యపురం సమీపంలో అదుపు తప్పి బోల్తాపడింది. ఈ ఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న డి.దేవరాజ్‌కు తీవ్ర గాయాలు కాగా, ఎల్.ఢిల్లేశ్వరికి స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను హైవే అంబులెన్స్‌లో టెక్కలి జిల్లా ఆసుపత్రికి తరలించగా, డాక్టర్ ప్రణీత్‌కుమార్ వైద్యసేవలు అందించారు. అనంతరం పోలీసులకు సమాచారం అందించారు.

ఆటో ఢీకొని యువకుడికి గాయాలు
ఇచ్ఛాపురం: బెల్లుపడ - ఈదుపురం కూడలిలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు తీవ్ర గాయాల పాలయ్యాడు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. పలాస నుంచి బరంపురం వైపు ద్విచక్రవాహనంపై ఓ యువకుడు బెల్లుపడ-ఈదుపురం కూడలికి చేరుకునేసరికి ఈదుపురం వైపు వెళ్తున్న ఆటో ఢీకొట్టింది. ఈ ఘటనలో యువకుడు తీవ్రంగా గాయపడి అపస్మారక స్థితికి చేరుకోవడంతో స్థానికులు 108 వాహనంలో ఇచ్ఛాపురం సీహెచ్‌సీకి తరలించారు. మెరుగైన చికిత్స కోసం బరంపురం పెద్దాసుపత్రికి తరలించారు. యువకుడి వివరాలు సేకరిస్తున్నామని పోలీసులు తెలిపారు.

పలాసలో గంజాయి మూట కలకలం

కాశీబుగ్గ: పలాస ఆర్టీసీ కాంప్లెక్సులో గంజాయి మూట పడేసి యువకుడు పరారైన ఘటన గురువారం సంచలనంగా మారింది. సాయంత్రం మూడున్నర గంటలకు బైక్‌పై వచ్చిన గుర్తుతెలియని యువకుడు పలాస ఆర్టీసీ డిపో ఔట్‌గేటు నుంచి లోపలకు చొరబడి ఇన్‌గేటు వైపు వెళ్తుండగా వాహనం నుంచి ఓ మూట కిందపడింది. దీనిని గమనించిన ఆర్టీసీ సిబ్బంది రవికుమార్ కేకలు వేసినా యువకుడు పట్టించుకోకుండా వెళ్లిపోయాడు. దీంతో ఆర్టీసీ మేనేజర్ వేదుల శ్రీనివాసరావుకు మూట అందించారు. అందులో దుస్తులతో పాటు మూడు కేజీల మూడువందల నలభై గ్రాముల గంజాయి ఉండటంతో విస్తుపోయారు. అనంతరం కాశీబుగ్గ పోలీసులకు సమాచారం అందించగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


గంజాయి మూట

గంజాయి స్వాధీనం?
మందస: మందస పోలీసులు గంజాయి స్వాధీనం చేసుకున్నారు. పక్కా సమాచారంతో ఎస్ఐ వై.రవికుమార్ ఆధ్వర్యంలో గంజాయి అమ్ముతున్న కేంద్రంపై దాడులు చేయగా ఈ వ్యవహారం వెలుగు చూసింది. అయితే పోలీసులు వివరాలను అధికారికంగా వెల్లడించడంలేదు. అంబుగాం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి, కాశీబుగ్గ, వజ్రపుకొత్తూరు మండలాలకు చెందిన మరో ముగ్గురు కలిసి గంజాయి వ్యాపారం చేస్తున్నట్టు సమాచారం. ఎప్పటి నుంచో ఈ వ్యవహారం గుట్టుగా కొనసాగుతుండగా తాజాగా పోలీసులకు సమాచారం అందినట్టు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో దాడులు నిర్వహించగా నలుగురు వ్యక్తులతో పాటు కొన్ని కిలోల గంజాయి దొరికినట్టు విశ్వసనీయంగా తెలిసింది. ఈ విషయమై మందస ఎస్ఐ వై.రవికుమార్ వద్ద ప్రస్తావించగా.. గంజాయి దొరికిన విషయం వాస్తవమేనన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు. త్వరలోనే పూర్తి వివరాలు వెల్లడిస్తామన్నారు.

క్రైమ్ కార్నర్

శుభలేఖలు పంచేందుకు వచ్చి..
– మద్యం మత్తులో కాలువలో పడి వ్యక్తి మృతి


అల్లు కామేష్ మృతదేహాన్ని పరిశీలిస్తున్న అధికారులు పోలీసులు

మెళియాపుట్టి: మండలంలోని గొప్పిలి వద్ద కాలువలో పడి వ్యక్తి మృతి చెందిన ఘటన గురువారం చోటుచేసుకుంది. మెళియాపుట్టి పోలీసులు తెలిపిన వివ రాల మేరకు.. పలాస మండలం లొద్దభద్ర గ్రామానికి చెందిన అల్లు కామేష్ (52) విశాఖపట్నానికి వలస వెళ్లి అక్కడే స్థిరపడ్డాడు. ఇటీవల కుమారుడికి వివాహం నిశ్చయించిన నేపథ్యంలో శుభలేఖలు పంచడానికి స్వగ్రా మం లొద్దభద్ర వచ్చాడు. అక్కడి నుంచి ఈ నెల 16న గొప్పిలి వెళ్లి మద్యం సేవించాడు. మద్యం మత్తులో సమీపంలోని మురుగు కాలువ(గెడ్డ)లో పడిపోయాడు. ఆ సమయంలో ఎవరూ లేకపోవడం, పొదలు నిండి ఉండటంతో ఎవరూ గమనించలేదు. గురువారం అటుగా వెళ్లిన స్థానికులు మృత దేహాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. అనంతరం విశాఖపట్నంలో ఉన్న కుటుంబసభ్యులకు విషయం తెలియజేశారు. మృతుని వద్ద ఫోన్ లేకపోవడంతో విషయం తెలియలేదని, గ్రామంలోనే ఉన్నాడనుకున్న ట్లు కుటుంబసభ్యులు తెలిపారు. ఘటనా స్థలాన్ని పాతపట్నం సీఐ వినోద్‌బాబు, ఎస్సై కామేశ్వరరావు, తహశీల్దార్, సరోజిని పరిశీలించారు. మృతుడి భార్య రమణమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని పాతపట్నం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

వీఆర్‌ఏ ఆత్మహత్య


కుంచెల రాంబాబు (ఫైల్)

పాతపట్నం: పాతపట్నం మేజర్ పంచాయతీ హరిజన గోపాలపురం గ్రామానికి చెందిన వీఆర్‌ఏ కుంచెల రాంబాబు(33)ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని ఎస్ఐ ఎస్.కామేశ్వరరావు తెలిపారు. రాంబాబు ఎ.ఎస్.కవిటి గ్రామ తలయారీగా (వీఆర్‌ఏ)గా పనిచేస్తున్నారు. ఆటో కూడా నడుపుతుంటారు. ఆటోను ఫైనాన్స్‌పై తీసుకుని సకాలంలో డబ్బులు చెల్లించలేకపోవడంతో మనస్తాపం చెంది గ్రామ సమీపంలోని చింతచెట్టుకు గురువారం ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. ఈయనకు భార్య భారతి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతదేహాన్ని పాతపట్నం సీహెచ్‌సీకి తరలించి పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. భారతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ చెప్పారు.

ఫీల్డ్ అసిస్టెంట్లపై విచారణ
కోటబొమ్మాళి : మేజర్ పంచాయతీ కోటబొమ్మాళి-1, 2 ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్లు చౌదరి సునీత, మంచాల స్వాతిలపై వచ్చిన ఫిర్యాదు మేరకు గురువారం స్థానిక సచివాలయంలో డ్వామా ఏపీడీ కె.లోకేశ్వరరావు, ఎంపీడీఓ నిశ్చ ల, ఏపీఓ హరిప్రసాద్ విచారణ చేపట్టారు. ఉపాధి వేతనదారులతో మాట్లాడి వివరాలు నమోదు చేసుకున్నారు. ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ బోయిన నాగేశ్వరరావు, సర్పంచ్ కాల్ల సంజీవరావు మాట్లాడుతూ ఇద్దరు ఫీల్డ్ అసిస్టెంట్లు నిర్లక్ష్యంగా విధులు నిర్వహిస్తూ, అక్రమాలకు పాల్పడుతున్నారని, ఇదేమని ప్రశ్నిస్తే పనులు కేటాయించడంలేదని చెప్పారు. తక్షణ మే వీరిని విధుల నుంచి తొలగించాలని కోరా రు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు బోయిన కృష్ణారావు, డబ్బీరు ప్రదీప్, కె.అప్ప లరాజురెడ్డి, దాసరి మోహనరావు, ఇప్పిలి చిరంజీవి పాల్గొన్నారు.

వడదెబ్బకు ఉపాధి వేతనదారు మృతి


మృతిచెందిన గురుగుబెల్లి శాంతమ్మ

ఆమదాలవలస రూరల్: మండలంలోని కలివరం పంచాయతీ పీర్‌సాహెబ్‌పేటకు చెందిన గురుగుబెల్లి శాంతమ్మ(72) గురువారం వడదెబ్బకు గురై మృతిచెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. కంచరావు వానిపేట సమీపంలో జరుగుతున్న ఉపాధి పనులకు వెళ్లిన శాంతమ్మ పనులు ముగించుకుని ఇంటికి తిరిగి వస్తున్న సమయంలో మార్గమధ్యలో స్పృహ తప్పి పడిపోయింది. శాంతమ్మ వృద్ధురాలు కావడంతో అందరితో కాకుండా ఇంటికి నెమ్మదిగా రావడంతో తోటి వేతనదారులు ముందుగానే ఇళ్లకు చేరుకున్నారు. ఆలస్యంగా నడుస్తున్న శాంతమ్మ ఎత్తుగా ఉండే పొలం గట్టు ఎక్కే సమయంలో స్పృహ తప్పి పడిపోయింది. ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో మృతిచెందింది. రెండో పూట ఉపాధి పనుల కోసం వస్తున్న తోటి వేతనదారులు శాంతమ్మను గుర్తించి సపర్యలు చేసినా ఫలితం లేకపోయింది. శాంతమ్మకు ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.

కర్రసాము పోటీల్లో జగదీష్‌కు స్వర్ణం

శ్రీకాకుళం న్యూకాలనీ: కర్రసాము పోటీల్లో జిల్లాకు చెందిన చంచలి జగదీశ్వరరావు సత్తాచాటుతున్నాడు. ఇటీవల బెంగళూరులో వరల్డ్ యూనియన్ సిలంబం (కర్రసాము) ఫెడరేషన్ నిర్వహించిన అంతర్జాతీయ ఓపెన్ కరస్రాము పోటీల్లో ఆంధ్రప్రదేశ్ నుంచి ఏడుగురు పాల్గొనగా అందులో మూడు బంగారం, మూడు రజత, కాంస్య పతకం సాధించారు. వీరిలో జిల్లాకు చెందిన సీహెచ్ జగదీష్ బంగారు పతకంతో మెరిశాడు. ఈయన స్వగ్రామం జలుమూరు మండలం యలమంచిలి. తండ్రి నరసింహమూర్తి రైతు, తల్లి గృహిణి. గత నెలలో కేరళలో జరిగిన జాతీయ స్థాయి కరస్రాము పోటీల్లోనూ స్వర్ణ పతకం సాధించి శభాష్ అనిపించాడు. బలగ కీర్తిక కోచ్‌గా వ్యవహరిస్తున్నారు. వీరంతా బల్దేవ్ ఇండియన్ ట్రెడిషనల్ మార్షల్ ఆర్ట్స్ సంస్థలో శిక్షణ పొందుతున్నారు. జగదీష్‌ను జిల్లా క్రీడాధికారులు, ఒలింపిక్, పీఈటీ సంఘ నాయకులు అభినందించారు.



పతకం, సర్టిఫికెట్‌తో సీహెచ్ జగదీష్

నడిరేయి బీభత్సం

- బుధవారం అర్ధరాత్రి గాలివాన విధ్వంసం
- తీర ప్రాంత నియోజకవర్గాలపై తీవ్ర ప్రభావం
- నేలకొరిగిన చెట్లు, విద్యుత్ స్తంభాలు
- అరటి, బొప్పాయి, కర్బూజా తోటలకు దెబ్బ
- భారీగా నేలరాలిన మామిడి
- రూ.2కోట్లకు పైగా నష్టం వాటిల్లినట్టు ప్రాథమిక అంచనా


టెక్కలిలో విద్యుత్ వైర్లను సరిచేస్తున్న సంబంధిత సిబ్బంది


పోలాకి: ఈదురుగాలులకు కోడూరు వద్ద చెల్లాచెదురైన కోళ్లఫారం

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం: చిమ్మ చీకటిలో గాలివాన విధ్వంసం సృష్టించింది. నడిరేతిరి పిడుగులు, ఉరుములతో సిక్కోలు ప్రజలను భయభ్రాంతులకు గురి చేసింది. వర్షంతో కూడిన ఈదురుగాలులు రైతులకు అకాల నష్టం తెచ్చిపెట్టాయి. విద్యుత్ శాఖకు సైతం నష్టం సంభవించింది. ప్రాథమిక అంచనా ప్రకారం రూ.2కోట్లకు పైగా నష్టం వాటిల్లింది. పలుచోట్ల చెట్లు, విద్యుత్ స్తంభాలు కూలిపోవడంతో రవాణాతో పాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ట్రాన్స్‌కో అధికారులు సకాలంలో స్పందించి, యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయడంతో త్వరగా విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. అర్ధరాత్రి దాటాక గాలివాన రావడంతో ప్రజల ప్రాణాలకు ముప్పు కలగలేదు. లేదంటే ఆస్తి నష్టంతో పాటు జన నష్టం కూడా సంభవించేది.

జిల్లాలో కొన్ని రోజులుగా ఎండలు ఠారెత్తిస్తున్నాయి. ఉక్కపోతతో జనాలు అల్లాడిపోతున్నారు. రోజురోజుకి ఉష్ణోగ్రత పెరగడంతో ప్రజలు బయటకి రాలేని పరిస్థితి నెలకొంది. ఈ క్రమంలో బుధవారం అర్ధరాత్రి దాటాక అకస్మాత్తుగా వాతావరణంలో మార్పులు వచ్చాయి. అర్ధరాత్రి దాటాక భారీ ఈదురుగాలులతో కూడిన వర్షం కురవడంతో ఉష్ణోగ్రత తగ్గి కాస్త చల్లబడింది. కానీ ఈ ఈదురుగాలులు తెచ్చిన నష్టం మాత్రం ఎక్కువగానే ఉంది.

సాధారణంగా పగటి ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉన్నప్పుడు భూమి నుంచి ఉపరితలంలోకి ఆవిరి వెళ్లి ఇలాంటి సుడిగాలి, ఆకస్మిక వర్షాలు పడుతుంటాయి. అందులో భాగంగానే బుధవారం అర్ధరాత్రి దాటాక గాలివాన భీభత్సం సృష్టించినట్టు అధికార వర్గాలు చెబుతున్నాయి.

విద్యుత్ శాఖకు దెబ్బ..
గాలి వాన దెబ్బ విద్యుత్ శాఖపై గట్టిగానే పడింది. రూ.55.50లక్షల మేర నష్టం వాటిల్లింది. ఈదురుగాలులకు 33కేవీ ఫీడర్స్ 55వరకు, 11కేవీ ఫీడర్స్ 277, 11కేవీ విద్యుత్ స్తంభాలు 93, ఎల్‌టీ విద్యుత్ స్తంభాలు 108 వరకు దెబ్బతిన్నాయి. వీటిలో చాలా వరకు కూలిపోయాయి. శ్రీకాకుళం, టెక్కలి, పాలకొండ డివిజన్‌లో ఈ నష్టం సంభవించింది. ఎక్కడికక్కడ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతినడంతో విద్యుత్ సరఫరాకు పెద్ద ఎత్తున అంతరాయం ఏర్పడింది. అయితే ట్రాన్స్‌కో అధికారులు సకాలంలో స్పందించి, వాటి మరమ్మతు పనులు చేపట్టడంతో దాదాపు విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. గురువారం మధ్యాహ్నం సమయానికి ఒక 33కేవీ ఫీడర్, ఐదు 11కేవీ ఫీడర్లు, 11కేవీకి చెందిన 42 విద్యుత్ స్తంభాలు, ఎల్‌టీకి చెందిన 54 స్తంభాలకు సంబంధించిన పనులు చేపట్టాల్సి ఉంది. సాయంత్రానికి దాదాపు మరమ్మతు పనులు పూర్తి చేశారు. డివిజన్ల వారీగా చూస్తే శ్రీకాకుళం డివిజన్‌లో రూ.15.45లక్షలు, టెక్కలి డివిజన్‌లో రూ.35.50 లక్షలు, పాలకొండ డివిజన్‌లో రూ.4.55లక్షలు నష్టం జరిగింది.

తీర ప్రాంతంలో..


సారవకోట: కిడిమిలో నేలరాలిన మామిడి


గార: బూరవెల్లిలో కూలిన అరటి చెట్లు

భారీ ఈదురుగాలులకు తీర ప్రాంత నియోజకవర్గాల్లో ఊహించని నష్టం సంభవించింది. ముఖ్యంగా టెక్కలి, నరసన్నపేట, ఎచ్చెర్ల, శ్రీకాకుళం నియోజకవర్గాలతో పాటు ఆమదాలవలస, పలాస నియోజకవర్గాల్లో ప్రభావం చూపాయి. ఎక్కడికక్కడ చెట్లు నేలకొరిగాయి. పలుచోట్ల విద్యుత్ స్తంభాలు కూలిపోయాయి, మామిడి పంట చాలావరకు నేలరాలిపోయింది. అరటి, బొప్పాయి, కర్బూజా తోటలు ధ్వంసమయ్యాయి. ప్రాథమిక అంచనా ప్రకారం ఈ మూడు పంటలు దాదాపు 162.44హెక్టార్లలో రూ.కోటి 49లక్షల 14వేలకు పైగా నష్టపోయాయి. అకస్మాత్తుగా వచ్చిన గాలివానతో రైతులకు అకాల నష్టం వాటిల్లింది. ఇది కేవలం ప్రాథమిక అంచనా మాత్రమే. మరికొన్ని ప్రాంతాలకు సంబంధించిన నష్టాల వివరాలు రావల్సి ఉంది. క్షేత్రస్థాయిలో అధికారులు గుర్తించాక ఎంతమేరకు ఉంటుందో చూడాల్సి ఉంది. 139.54 హెక్టార్లలో అరటి, 12.50 ఎకరాల్లో బొప్పాయి, 10 ఎకరాల్లో కర్బూజా నష్టం సంభవించినట్టు అధికారుల ప్రాథమిక లెక్కలు చెబుతున్నాయి.


పిడుగుపాటుకు దగ్ధమైన పూరిపాక

పిడుగుపాటు..
సరుబుజ్జిలి: పాతపాడు గ్రామంలోని పున్నాల అప్పారావుకు చెందిన పూరిపాకపై గురువారం పిడుగు పడింది. పిడుగుపాటుకు పాకలో నిల్వ చేసిన టేకు దుంగలు, విలువైన వ్యవసాయ పరికరాలు, ఇతర వస్తువులు పూర్తిగా కాలిపోయినట్లు బాధితుడు తెలిపాడు. నష్టం సుమారు రూ.లక్ష వరకు ఉండవచ్చునని స్థానికుల అంచనా. ఆమదాలవలస అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు.

రైలు ఢీకొని 38 గొర్రెలు మృతి
కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో ఉన్న జయరామచంద్రపురం గ్రామంలో గురువారం రైలు ఢీకొని 38 గొర్రెలు దుర్మరణం పాలయ్యాయి. గ్రామానికి చెందిన కిక్కర సోమేశ్వరరావు, అప్పారాలకు చెందిన గొర్రెలతో గ్రామ శివారులో మంద వేశారు. బుధవారం రాత్రి కురిసిన ఉరుములు, మెరుపుల వానకు తీవ్రంగా ఇబ్బంది పడ్డారు. పిడుగు శబ్దానికి భయపడి గొర్రెలు రైలు పట్టాలు ఎక్కాయి. అదే సమయంలో గుర్తు తెలియని రైలు ఆ వైపుగా వచ్చి గొర్రెలను ఢీకొట్టింది. దీంతో 38 గొర్రెలు చనిపోయాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. రూ.5లక్షలకుపైగా ఆస్తినష్టం సంభవించి ఉంటుందని తెలిపారు.

